క్లుప్తంగా...

అజ్మీర్ దర్గా సందర్శన



చాదర్‌ను సమర్పిస్తున్న పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: తెలంగాణ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ గురువారం అజ్మీర్ దర్గాను సందర్శించి మొక్కులు సమర్పించుకున్నారు. సాంప్రదాయబద్ధంగా చాదర్‌ను సమర్పించారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు మైనార్టీ ప్రముఖులతో పాటు బీఆర్‌ఎస్ మైనార్టీ నేతలు కూడా డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌తో కలిసి అజ్మీర్ పర్యటనకు వెళ్లారు.

కట్టమైసమ్మ హుండీ ఆదాయం రూ.4.13 లక్షలు



చిలకలగూడ : చిలకలగూడ కట్టమైసమ్మ నల్లపోచమ్మ ఆలయం హుండీని గురువారం ఈఓ మహేందర్‌గౌడ్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆండాళ్, కార్పొరేటర్ సామల హేమ సమక్షంలో లెక్కించారు. మూడు నెలలు హుండీ ద్వారా లభించిన రూ.4,13,136 ఆదాయాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమచేసినట్లు ఈఓ మహేందర్‌గౌడ్ తెలిపారు. లెక్కింపులో ప్రధాన అర్చకులు తిరుమలాచార్యులు, భక్తులు మహేందర్ ముదిరాజ్, నాగేందర్, కోటమురళీ, సాయి యాదవ్, నాగేశ్వరరావు, చోటప్రభు, రాజేష్, శ్రీనివాస సేవదళం సభ్యులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌ని కలిసిన డీసీ

లాలాపేట: జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సుధాంష్ గురువారం తార్నాకలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డిని ఆమె కార్యాలయంలో కలిశారు. నగరంలో గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఉత్పన్నమవుతున్న సమస్యలపై చర్చించారు. భారీ వర్షాల నేపథ్యంలో మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీంలు, ఈవీడీఎం-డీఆర్‌ఎఫ్ బృందాలను ప్రజలకు అందుబాటులో ఉండేలా నిత్యం పర్యవేక్షణ చేయాలనీ డీసీకి సూచించారు.

శస్త్ర చికిత్సలో అనస్తీషియా టెక్నీషియన్ పాత్ర కీలకం



అనస్తీషియా, థియేటర్ టెక్నాలజీ సిబ్బందితో కళాశాల డీన్

అమీర్‌పేట: ఎలాంటి శస్త్ర చికిత్స చేసినా అనస్తీషియా టెక్నీషియన్ల పాత్ర కీలకంగా ఉంటుందని సనత్‌నగర్ ఈఎస్‌ఐసీ మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ మాధురి శిరీష్ కాటే అన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో గురువారం జాతీయ అనస్తీషియా, ఆపరేషన్ థియేటర్ టెక్నాలజిస్ట్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడుతూ.. అనుభవజ్ఞులైన వైద్యులు ఉన్నప్పటికీ అనస్తీషియా లేనిదే శస్త్ర చికిత్సలు చేయడం సాధ్యం కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఇమ్మానియేల్, డీఎం.ఎస్.బాలసోమేష్, డైరెక్టర్స్ రాజేందర్ పిల్లై, రామారావు, హెచ్ఓడీ నాగార్జున, టెక్నీషియన్లు చంద్రశేఖర్, శ్రీను కల్లూరి, సుభాష్, మల్లికార్జున, నర్సింగ్ ఆర్డర్లీ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



జయశ్రీ

బౌద్ధనగర్: ఇంటి నుంచి బయటకు ఓ వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. వారాసిగూడలోని ఎల్‌ఎస్ నగర్‌కు జయశ్రీ(19) ఈ నెల 19న తన తండ్రితో గొడవపడి అదే రోజు సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రైనా ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. జయశ్రీ స్నేహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తుకారంగేట్ పరిధిలో..



ఉప్పడి అమృత

అడ్డగుట్ట: ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన తుకారంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఇన్‌స్పెక్టర్ అంజనేయులు వివరాల ప్రకారం.. తుకారంగేట్ మాంగర్ బస్తీకి చెందిన ఉప్పడి అమృత(20) ఈ నెల 20న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి ఎంతకీ రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, బంధువులు తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వర్షం.. రోడ్లు జలమయం

- జలమయమైన రహదారులు
- పొంగిన డ్రైనేజీలు

రోజంతా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న జడివానతో జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. కూలీలు, ఉద్యోగులు తమ తమ పనుల కోసం వెళ్లే క్రమంలో నానా ఇక్కట్లకు గురయ్యారు. లాలాపేటలోని ఓపెన్ నాలాలో వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. మ్యాన్‌హోళ్లు పొంగి లాలాపేట, శాంతినగర్, తార్నాక, లాలాపేట, ఓయూ క్యాంపస్ రోడ్లన్నీ జలమయమయ్యాయి. తార్నాక, లాలాపేట ప్రధాన రహదారిలో తీవ్రమైన ట్రాఫిక్ జాం తలెత్తింది. అడ్డగుట్ట, తుకారాంగేట్, మెట్టుగూడ, అలుగడ్డ బావి, లాలాగూడ, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వరదనీరు భారీగా పారింది. లాలాగూడలో గురువారం వారాంతపు సంత ఉండడంతో విక్రయదారులు వర్షంలోనే తమ వ్యాపారాలు కొనసాగించారు. పద్మారావునగర్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్డు పక్కన ఉన్న భారీ చెట్లు రోడ్డుపై పడ్డాయి. చిలకలగూడ ఈద్గా వద్ద ఓ కారుపై చెట్టు కూలడంతో ధ్వంసమైంది. –సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం







చెరువును తలపిస్తున్న అలుగడ్డబావిలోని కూరగాయల మార్కెట్



ఆలస్య ప్రకటనతో విద్యార్థులకు ఇక్కట్లు..

చిలకలగూడ: భారీ వర్షాల కారణంగా గురువారం ఉదయం పాఠశాలలు ప్రారంభమైన తర్వాత సెలవు ప్రకటన వెలువడడంతో విద్యార్థులు, తల్లితండ్రులు ఇబ్బందులకు గురయ్యారు. గంట వ్యవధిలో వర్షంలోనే ఇంటి నుంచి పాఠశాల, పాఠశాల నుంచి ఇంటికి తిగాల్సిన పరిస్థితి వచ్చింది. తమ తమ పిల్లలను తీసుకువచ్చేందుకు ఉద్యోగులు, కూలీలు వర్షంలోనే పాఠశాలలకు వచ్చి ఇబ్బందులు పడుతూ తీసుకెళ్లారు. ముందస్తుగానే సెలవు ప్రకటించకపోవడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



లాలాపేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పారుతున్న వరద





తార్నాకలో కురుస్తున్న భారీ వర్షం



చిలకలగూడ ఈద్గా సమీపంలోని ప్రధాన రహదారిలో..







బాపూబాగ్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్, అధికారులు



బోయిన్‌పల్లిలో జలమయమైన ఓ వీధి



లాలాపేట, సత్యానగర్‌లో..

'మణిపూర్ ఘర్షణలు నిలువరించడంలో కేంద్రం విఫలం'



మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు

లాలాపేట: మూడు నెలల నుంచి మణిపూర్‌లో మైతి, కూకి జాతుల మధ్య జరుగుతున్న ఘర్షణలను కేంద్రం ప్రభుత్వం నిలువరించకుండా వారి రాజకీయాల కోసం వాడుకుంటున్నారని పలువురు విద్యార్థి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్ ఘర్షణలకు నిరసనగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఓయూ క్యాంపస్‌లో ప్రధాని మోదీ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఘర్షణలకు ఆ రాష్ట్ర సీఎం బీరన్ సింగ్, ప్రధాని మోదీ నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహిక అత్యాచారం చేసినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఆ ప్రాంతంలో శాంతిని నెలకొల్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి నేతలు సత్య, రవి, ఆజాద్,అఖిల్, యాదగిరి,శ్రీను, అనంత శర్మ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన సమాజానికి తలవంపు..

అడ్డగుట్ట: మణిపూర్‌లో ముగ్గురు గిరిజన మహిళలను సామూహికంగా అత్యాచారం చేసి నగ్నంగా ఊరేగించడం సభ్యసమాజానికి తలవంపు అని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంఘటనతో బీజేపీ అసలు రూపాన్ని బయట పెట్టుకుందని విమర్శించారు. మతతత్వ పాసిస్టు చర్యలకు పరాకాష్ఠ అని పేర్కొన్నారు. రానున్న ఎన్నికలలో బీజేపీని ఓడించకపోతే మరిన్ని దారుణాలు చూడాల్సి వస్తుందన్నారు. దారుణాన్ని అడ్డుకున్న ఓ మహిళా తండ్రిని, తమ్ముడిని కిరాతకంగా హత్య చేశారన్నారు. ఈ సంఘటనకు బాధ్యత వహిస్తూ దేశ హోమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

గోల్డెన్ గేట్ యూనివర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

అమీర్‌పేట: అమెరికాలోని ప్రఖ్యాత గోల్డెన్ గేట్ యూనివర్సిటీలో అర్హులైన విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు ఇస్తున్నట్లు యూనివర్సిటీ అధ్యక్షులు డాక్టర్ డేవిడ్ ఫైక్ తెలిపారు.గురువారం అమీర్‌పేట ఆదిత్యాపార్కు హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ నగరంలోని హబ్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో మేనేజ్‌మెంట్, ఐటీ, ఇంజినీరింగ్ విభాగాల్లో పలు రకాల కోర్సులను అందిస్తున్నామన్నారు. ఈ నెల 22న ఇదే హోటల్‌లో జరిగే స్పాట్ అడ్మిషన్ల కార్యక్రమానికి విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి వచ్చి యూనివర్సిటీ ప్రతినిధులతో మాట్లాడాకే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ ప్రతినిధులు డాక్టర్ జాక్వెన్ గొన్జాలెజ్,రోసిటీ లెస్మానా పాల్గొన్నారు.

మాదకద్రవ్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

అమీర్‌పేట: మాదక ద్రవ్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసిన ఘటన అమీర్‌పేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి వివరాల ప్రకారం.. మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నారన్న సమాచారంతో హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. యూసుఫ్‌గూడ పిల్లర్ నెం.1531 వద్ద అనుమానాస్పదంగా కనిపించిన సయ్యద్ సోహెబ్ అహ్మద్‌ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 14 గ్రాముల ఎండీఎంఏ మాదక ద్రవ్యం ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు.

'ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న కేసీఆర్'



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న సారంగపాణి

సికింద్రాబాద్: సీఎం కేసీఆర్ ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ఆరోపించారు. బాటసింగారం డబుల్ బెడ్రూమ్‌ల పరిశీలనకు వెళ్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అరెస్ట్‌ను ఖండిస్తూ సీతాఫల్‌మండిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన పనులను పరిశీలించే హక్కు కేంద్ర మంత్రికి ఉంటుందన్నారు. తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.

22న సెమిస్టర్ పరీక్షల వాయిదాపై స్పష్టత

లాలాపేట: సెమిస్టర్ పరీక్షల వాయిదాపై ఉస్మానియా యూనివర్సిటీ, ఓయూ అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమావేశమై ఈ నెల 22న స్పష్టత ఇస్తామని ఓయూ వైస్ చాన్స్‌లర్ ప్రొ. రవీందర్ యాదవ్ తెలిపారు. పరీక్షలు వాయిదా వేయాలంటూ విద్యార్థులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో వీసీ, రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మీనారాయణతో కలిసి ఆయన మాట్లాడారు. విద్యార్థుల శ్రేయస్సు కోసమే తాము పని చేస్తున్నామని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎలాంటి సమస్యలున్నా ముందుగానే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పరీక్షలు వాయిదా వేయడం వలన యూనివర్సిటీ పరిధిలోని 200 పీజీ కళాశాలలకు చెందిన 10 వేల మంది విద్యార్థులపై ప్రభావం పడుతుందన్నారు. విదేశీ విద్యార్థులు ఇప్పటికే తమ ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని ఇలాంటి పరిస్థితుల్లో పరీక్షలు వాయిదా వేయాలని అడగడం సరైంది కాదన్నారు.

కులం పేరుతో దూషించిన ఆరుగురిపై కేసు

బౌద్ధనగర్: కులం పేరుతో దూషించడమే కాక ఓ వ్యక్తిపై దాడి చేసిన ఆరుగురిపై కేసు నమోదైన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బోనాల పండుగ సందర్భంగా ఈ నెల 16న రామ్‌నగర్‌లో అమ్మవారి తొట్టెల ఊరేగింపు సందర్భంగా పలువురు యువకులు గొడవలు పడుతుండగా అదే ప్రాంతానికి చెందిన రెడ్డిమాల నర్సింగ్‌రావు ఆపేందుకు ప్రయత్నించాడు. దీంతో ఒక్కసారిగా నర్సింగ్‌రావుపై అదే ప్రాంతానికి చెందిన ధన్‌రాజ్, గంగపుత్ర సాయి, సాయిరామ్, సుధీర్, కిరణ్, రవి మూకుమ్మడిగా దాడి చేశారు. అంతటితో ఆగకుండా నర్సింగ్‌రావు కుమారుడు అఖిల్‌పై సైతం దాడి చేశారు. అనంతరం వారి కుటుంబసభ్యులను సైతం కులం పేరుతో అసభ్యకరంగా దూషించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఆరుగురికిపై కేసు నమోదు చేశామన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో కార్పొరేటర్ పర్యటన

బౌద్ధనగర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గురువారం కార్పొరేటర్ కంది శైలజ గురువారం లోతట్టు ప్రాంతాలైన ఏఆర్‌కే నగర్, అశోక్ నగర్, గొల్ల పుల్లయ్య బావి, కౌసర్ మసీదు ప్రాంతాల్లో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు తెలుసుకొని ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించే విధంగా సహాయక బృందాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. ఈ పర్యటనలో శ్రీకాంత్, డీఈ రఘు, ఏఈ శశిధర్ పాల్గొన్నారు.

నాలా పరీవాహక ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలి



చిలకలగూడ : గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నాలా పరీవాహక ప్రాంతాల వాసులు అప్రమత్తంగా ఉండాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ సూచించారు. మహ్మద్‌గూడ నాలా, పూడికతీత, డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పూడికతీత పనులను గురువారం ఆమె పరిశీలించారు. పూడికతీత పనులను పూర్తిచేసి, మహ్మద్‌గూడ నాలా రిటైనింగ్‌వాల్ పనులు త్వరితగతిన చేపట్టాలన్నారు. నాలా మధ్యలో ఉన్న ఇసుక బస్తాలను తీసి వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.

ధన్‌బాద్ ఐఐటీని సందర్శించిన అధ్యాపకుల బృందం

లాలాపేట: ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. శ్రీరామ్ వెంకటేష్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ డి.విజయ్‌కుమార్, కార్యదర్శి డా. ఎం.ఎస్ వెంకట్రామయ్యతో కూడిన ముగ్గురు సభ్యుల బృందం గురువారం ధన్‌బాదలోని ఐఐటీ(ఐఎస్ఎం)ని సందర్శించారు. ఐఐటీలో మైనింగ్ ఇంజినీరింగ్ విభాగం, ప్రయోగశాలల ఏర్పాటులో అనుసరించిన విధానాలను అధ్యయనం చే యడానికి ధన్‌బాద్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ పట్నాయక్, డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ధీరజ్‌కుమార్‌తో సమావేశం అయ్యారు. ప్రయోగశాలల అభివృద్ధికి, ప్రాజెక్టులు అన్ని విధాలుగా మద్దతు, సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

బీజేపీ నాయకుల గృహనిర్బంధం

సనత్‌నగర్: 'డబుల్' ఇళ్ల పేరుతో సీఎం కేసీఆర్ పేదలను మోసం చేస్తున్నారని బీజేపీ నేత మర్రి శశిధర్‌రెడ్డి విమర్శించారు. డబుల్ బెడ్రూమ్‌ల పరిశీలనకు వెళ్తున్న ఆయనను గురువారం తార్నాకలోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

రాంగోపాల్‌పేట్: రాంగోపాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ చీర సుచిత్ర, చీర శ్రీకాంత్‌లను బోయిన్‌పల్లిలోని నివాసంలో అడ్డుకున్నారు. ఎడతెరిపిలేని వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని డివిజన్ పర్యటన చేయాలని చెప్పి ఆమె అక్కడి నుంచి వచ్చి బాటసింగారం వెళ్లారు. ఈ సందర్భంగా పోలీసులు, వారికి మధ్య వాగ్వాదం జరిగింది.

లాలాపేట: మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామ్‌చందర్‌రావును ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మాజీ మేయర్, బండా కార్తీకరెడ్డిని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు ఇంటి వద్దనే అడ్డుకున్నారు.

చిలకలగూడ : బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, బీజేవైఎం ఉపాధ్యక్షుడు భాస్కర్‌గిరితో పాటు మరో నలుగురిని వేకువజామున పోలీసులు గృహ నిర్బంధం చేశారు.

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణను మహేంద్రాహిల్స్‌లోని ఆయన నివాసం నుంచి బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భానుక మల్లికార్జున్‌ను భావనా కాలనీలోని నివాసంలో అదుపులోకి తీసుకున్నారు.



మర్రి శశిధర్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు